అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు

అయిజ, డిసెంబర్ 16 : అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకుడు హరీశ్ అన్నారు. తెలంగాణలోని అన్ని శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలకు నోటిఫికేషన్లు జారీ చేయడంతోపాటు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్‌లను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ చలో అసెంబ్లీకి పిలుపునివ్వడంతో సోమవారం హరీశ్‌ను అక్రమంగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని మేనిఫెస్టోలో చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగాలను భర్తీ చేయకుండా నిరుద్యోగులను వంచించిందన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడంతో ఎంతో మంది విద్యార్థులు విద్యకు దూరమవుతున్నారని పేర్కొన్నారు. ప్రతి ఏటా విడుదల చేయాల్సిన స్కాలర్ షిప్‌లను పెండింగ్ పెట్టి విద్యార్థులకు మొండి చెయ్యి చూపించిందన్నారు. అనంతరం సొంత పూచీకత్తుపై ఎస్సై విజయ్‌భాస్కర్ విడుదల చేశారు.

పోలీస్ స్టేషన్‌లో ఎస్సై అదుపులో ఉన్న పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకుడు హరీశ్

గ్రామాభివృద్ధికి ఒక్క రూపాయీ ఇవ్వలే..

- అప్పుల బాధలో మాజీ సర్పంచులు
- బీఆర్‌ఎస్ యువజన నాయకుడు కిశోర్

అలంపూర్ చౌరస్తా, డిసెంబర్ 16 : కాంగ్రెస్ అధికారంలో వచ్చి ఏడాదైనా రాష్ట్రంలోని గ్రామ పంచాయతీలకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని అలంపూర్ బీఆర్‌ఎస్ యువజన నాయకుడు కిశోర్ అన్నారు. సోమవారం అలంపూర్ చౌరస్తాలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏడాది కిందట చేసిన పనులకు బిల్లులు రాక మాజీ సర్పంచులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పనుల కోసం అప్పులు తెచ్చి గ్రామాభివృద్ధి పనులు చేశారని కానీ పనులకు బిల్లులు చేయకుండా మాజీ సర్పంచులను ప్రభుత్వం వేధిస్తుందని మండిపడ్డారు. బిల్లుల కోసం అసెంబ్లీ ముట్టడి వెళ్తున్న అయిజమండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు హన్మంతురెడ్డి గృహనిర్బంధం, అలంపూర్ నియోజకవర్గంలో మాజీ సర్పంచులను అరెస్టులు చేసి పోలీస్ స్టేషన్లకు తరలించడం సిగ్గుచేటన్నారు. గత ప్రభుత్వంలో కేసీఆర్ పల్లెలను అద్భుతంగా తీర్చిదిద్దారని పల్లెప్రగతి, పట్టణ ప్రగతి వంటి గొప్ప కార్యక్రమాలు అమలు చేసి పల్లె ప్రగతికి రూ.275కోట్లు, పట్టణ ప్రగతికి రూ. 150 కోట్లు కేటాయించి దేశానికే ఆదర్శంగా నిలిపారన్నారు. ఈప్రభుత్వం వచ్చాక కనీసం ఎస్‌ఎఫ్‌సీ నిధులు విడుదల కావడం లేదని 15వ ఫైనాన్స్ కమిషన్ బిల్లులు కూడా డైవర్ట్ చేశారని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం మాజీ సర్పంచులకు బిల్లులను ఎప్పుడు చెల్లిస్తారో స్పష్టమైన తేదీని ప్రకటించాలని డిమాండ్ చేశారు.

మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ యువజన నాయకుడు కిశోర్

పెండింగ్ బిల్లులు అడిగితే అరెస్టులా?

అలంపూర్ చౌరస్తా, డిసెంబర్ 16 : పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరితే ముందస్తు అరెస్టులు చేయడం సరికాదని ఉండవల్లి సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు సురవరం లోకేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయనను పోలీసులు మహాధర్నా కార్యక్రమానికి వెళ్లకుండా ముందస్తు అరెస్టులు చేశారు. ఈ సందర్భంగా లోకేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క మీడియా సమావేశంలో త్వరగా పెండింగ్ బిల్లులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చినా ఇంత వరకు బిల్లులు చెల్లించకపోవడంతో అప్పుల బాధలతో మాజీ సర్పంచులు సతమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అభివృద్ధి పనుల కోసం చేసిన అప్పులకు వడ్డీలు కట్టలేక ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి నెలకొందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు శేషన్‌గౌడ్, పవిత్ర జనార్దన్‌రెడ్డి, శివరాములు, భాస్కరయ్య, ఏదన్న తదితరులు పాల్గొన్నారు.

ఉండవెల్లి పోలీస్‌స్టేషన్‌లో మాజీ సర్పంచులు

దేశానికే ఆదర్శం కేసీఆర్ పాలన

- సర్పంచుల సంఘం మండల మాజీ అధ్యక్షుడు హన్మంతురెడ్డి

అయిజ, డిసెంబర్ 16 : పదేండ్ల కేసీఆర్ పాలన దేశానికే ఆదర్శంగా నిలిచిందని, ఏడాది కాంగ్రెస్ పాలనలో పల్లెలను పట్టించుకోకుండా, పెండింగ్ బిల్లులు విడుదల చేయకుండా కాలయాపన చేస్తూ బిల్లులు చెల్లించాలని మాజీ సర్పంచులు నెత్తినోరు మొత్తుకుంటున్నా పట్టించుకోకుండా అరెస్టులు చేయిస్తుందని అయిజ మండల సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు హన్మంతురెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని జడదొడ్డి మాజీ సర్పంచ్, మండల సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడిని పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా హన్మంత్‌రెడ్డి మాట్లాడుతూ లక్షల రూపాయలను అప్పులు చేసి పంచాయతీలను అభివృద్ధి చేశామని, పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే అరెస్టులు చేయడం శోచనీయమన్నారు. రాష్ట్రంలో ఎంతో మంది మాజీ సర్పంచులు అప్పుల పాలై ఆత్మహత్యలు చేసుకుంటున్నా ప్రభుత్వం స్పందించడంలేదన్నారు. ఏడాది కాంగ్రెస్ పాలనలో ఒక్కపైసా విడుదల కాకపోవడంతో పల్లెల్లో అభివృద్ధి కుంటుపడిందని ఆరోపించారు. అనంతరం ఆయనను ఎస్సై విజయ్‌భాస్కర్ సొంత పూచీకత్తుపై విడుదల చేశారు.

అయిజ పోలీసుల అదుపులో మండల సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు హన్మంతురెడ్డి

సమగ్ర శిక్షా ఉద్యోగుల సమస్యలు సీఎం దృష్టికి తీసుకెళ్తా

- ప్రణాళికా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి



చిన్నారెడ్డిని కలిసి వినతి పత్రాన్ని అందజేసి సమస్యలు తెలుపుతున్న సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం నేతలు

వనపర్తి టౌన్, డిసెంబర్ 16 : రాష్ట్రంలో విధులు నిర్వర్తిస్తున్న 19,300 మంది సమగ్ర శిక్షా ఉద్యోగుల సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని ప్రణాళికా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి అన్నారు. సోమవారం మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో చిన్నారెడ్డితో సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం ప్రతినిధులు భేటీ అయ్యారు. సమస్యల పరిష్కారం కోసం వారం రోజుల నుంచి సమ్మె చేస్తున్న తమకు అనుకూలంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకునేలా చర్యలు తీసుకోవాలని వారు చిన్నారెడ్డిని కోరారు. సమగ్ర శిక్షా ఉద్యోగులందరిని విద్యాశాఖలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలని అప్పటి వరకు ఉద్యోగ భద్రతతో కూడిన పే స్కేల్ ఇవ్వాలని, ఉద్యోగుల రీ ఎంగేజ్ విధానాన్ని తీసివేయాలని, ప్రతి ఉద్యోగికి బీమా సౌకర్యం కల్పించాలని, ఉద్యోగ విరమణ చేసిన వారికి బెనిఫిట్స్ ఇవ్వాలని వారు చిన్నారెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం చిన్నారెడ్డి మాట్లాడుతూ సమగ్ర శిక్షా ఉద్యోగుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్తానన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ మోహన్‌రెడ్డి, పీఆర్‌టీయూ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, పీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దామోదర్‌రెడ్డి, సహ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుల యాదగిరి, ప్రధాన కార్యదర్శి ఝాన్సీ, సౌజన్య ఉన్నారు.

క్రీడలు ఆత్మవిశ్వాసాన్ని మరింత పెంపొందిస్తాయి

- కలెక్టర్ సంతోష్

వాలీబాల్ క్రీడా పోటీలు ప్రారంభిస్తున్న కలెక్టర్, ఎస్పీ

గద్వాల, డిసెంబర్ 16 : క్రీడలు మనలో సంకల్పశక్తి, ఒడిదుడుకులను అధిగమించే సామర్థ్యాన్ని పెంచి ఆత్మవిశ్వాసాన్ని మరింత బలపరుస్తాయని కలెక్టర్ సంతోష్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో జిల్లా క్రీడల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి సీఎం కప్-2024 క్రీడాపోటీలను సోమవారం ఎస్పీ శ్రీనివాస్‌రావుతో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ పట్టణ క్రీడాకారులను జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీలకు తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. క్రీడలు శారీరక ఆరోగ్యానికే కాకుండా విద్యావ్యక్తిత్వ వికాసానికి ఉపయోగపడతాయన్నారు. ఐఏఎస్, ఐపీఎస్ వంటి ఇంటర్వ్యూలో కూడా క్రీడలపై ప్రశ్నలు అడుగుతారన్నారు. వ్యక్తిగతంగా విజయం సాధించడం కంటే టీమ్‌గా కలిసి పని చేయడంతో విజయాలు ఎక్కువగా చేకూరడానికి అవకాశం ఉంటుందన్నారు. పోటీ ప్రపంచంలో మానసిక ఒత్తిడి అధికమవుతున్న నేపథ్యంలో క్రీడలు మన ఆలోచనా విధానాన్ని మెరుగుపరుస్తాయన్నారు. అనంతరం ఎస్పీ శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ క్రీడలు మనిషి జీవితంలో విజయాలను సాధించడానికి అనేక కీలకమైన నైపుణ్యాలను నేర్పించి వాటి ద్వారా జీవితంలో ప్రతి సమస్యను సమర్థవంతంగా ఎదుర్కొనడంలో సహాయపడతాయన్నారు. క్రీడల్లో ఓడిపోయినా, మళ్లీ లేచి విజయం కోసం పోరాటం చేయడం నేర్చుకుంటామన్నారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా, రాష్ట్రస్థాయికి ఆపై దేశస్థాయికి చేరుకోవాలన్నారు. క్రమశిక్షణ, నిరంతర అభ్యాసం నైపుణ్యాలపై శ్రద్ధ పెడితే విజయం సాధిస్తారని చెప్పారు. అనంతరం మండలస్థాయి కబడ్డీ, వాలీబాల్‌లో ఫైనలిస్టులను కలెక్టర్, ఎస్పీ ప్రశంసించి ఫైనల్ మ్యాచ్ ను ప్రారంభించారు. కలెక్టర్, ఎస్పీ స్వయంగా వాలీబాల్ ఆడి క్రీడాకారులను ఉత్తేజపరిచారు. కార్యక్రమంలో అధికారులు కాంతమ్మ, ఆనంద్, క్రీడాకారులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థులను అభినందించిన కలెక్టర్, ఎస్పీ

ధరూర్, డిసెంబర్ 16 : జాతీయ స్థాయికి గద్వాల విద్యార్థులు ఎంపిక కావడం చాలా సంతోషకరమని కలెక్టర్ సంతోష్, ఎస్పీ శ్రీనివాస రావు పేర్కొన్నారు. గతనెల 30వ తేదీన మహబూబ్‌నగర్ జిల్లాలో జరిగిన రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్‌ఐ అండర్-14 బాల, బాలికల రగ్బీ పోటీల్లో ధరూర్ ఉన్నత పాఠశాల విద్యార్థులు తిరుమలేశ్, ఉరుకుందమ్మ, అండర్-17 విభాగంలో చింటు పాల్గొని ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయిలో ఎంపికయ్యారన్నారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో సీఈవో లక్ష్మీకాంతమ్మ, అధికారులు జితేందర్, ఆనంద్, శ్రీనివాస్ గౌడ్, జీహెచ్‌ఎం ప్రతాప్ రెడ్డి, శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

వైభవంగా రథోత్సవం..

- భక్తులతో కిక్కిరిసిన తిమ్మప్ప క్షేత్రం

మల్దకల్‌లో రథోత్సవం పాల్గొన్న భక్తులు

మల్దకల్, డిసెంబర్ 16 : ఆదిశిలా క్షేత్రంలో ఆదివారం అర్ధరాత్రి మల్దకల్ తిమ్మప్ప స్వామి రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. గోవింద నామస్మరణ మధ్య భక్తులు రథాన్ని లాగారు. రథోత్సవానికి గద్వాల, కర్నాటక, మహరాష్ట్ర, గుంతకల్, కర్నూల్ జిల్లాల నుంచి అధికసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయం నుంచి ఆంజనేయ స్వామి ఆలయం వరకు స్వామివారి రథాన్ని భక్తులు లాగారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, ఈవో సత్యచంద్రారెడ్డి, సీఐ, ఎస్సై, పర్యవేక్షించారు. కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షుడు తిమ్మారెడ్డి, నాయకులు మధుసూదన్‌రెడ్డి, నరేందర్, బాబురావు, మధు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో యువత రాణించాలి

ధరూర్, డిసెంబర్ 16 : గ్రామాల్లోని యువత క్రీడా పోటీల్లో మెరుగైన ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయిలో మన ప్రాంతానికి మంచి గుర్తింపు తీసుకురావాలని కాంగ్రెస్ నాయకుడు డీఆర్ విజయ్‌కుమార్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని క్రిస్మస్ పండుగ పురస్కరించుకొని డీపీఎల్-3 సీజన్ క్రికెట్ పోటీలను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించేందుకు కృషిచేయాలన్నారు. క్రికెట్‌తె పాటు ఇతర క్రీడా పోటీల్లో కూడా సత్తా చాటాలని పిలుపునిచ్చారు. క్రీడాకారులకు తనవంతు సహాయ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో డీఆర్ శ్రీహర్ష, నిర్వాహకులు రాజు, గోవింద్, సురేశ్, షాకీర్, నౌషద్, గణేశ్, రాజు, రవి, నాగరాజు, రవి, అబ్రహం, సంజీవ్, రాములు ఉన్నారు.

పంచాయతీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

పాన్‌గల్‌లో విలేకరులతో మాట్లాడుతున్న పంచాయతీ కార్మికులు

పాన్‌గల్, డిసెంబర్ 16 : గ్రామపంచాయతీల్లో పనిచేస్తున్న పంచాయతీ కార్మికులకు ఉద్యోగభద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా నాయకులు ఎల్లస్వామి, సుగ్రీవుడు, యాదగిరి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండలకేంద్రంలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పంచాయతీ కార్మికులకు 10నెలలుగా జీతాలు పెండింగ్‌లో ఉన్నాయని, దీంతో వారు పస్తులుండి పని చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన మల్టీపర్పస్ వర్కర్ విధానంతో పంచాయతీ కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పీఎఫ్, ఈఎస్ఐ, రిటైర్మెంట్ బెనిఫిట్స్ తదితర సదుపాయాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

మోకాళ్లపై నిరసన తెలిపిన ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగులు

గద్వాలటౌన్, డిసెంబర్ 16 : జిల్లా కేంద్రంలోని స్మృతివనం ఎదుట ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగుల చేపట్టిన సమ్మె కొనసాగింది. సోమవారం నాటికి సమ్మె ఏడో రోజుకు చేరుకున్నది. సమ్మెలో భాగంగా ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగులు మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ రెగ్యులర్ చేసే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కొన్నేండ్లుగా చాలీచాలని జీతాలతో నెట్టుకొస్తున్న తమను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. లేకపోతే నిరసన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఉసేనప్ప, ప్రధానకార్యదర్శి గోపాల్, మహిళా అధ్యక్షురాలు ప్రణీత, రామాంజనేయులు, శ్రీనివాసులు, శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య

ఆత్మకూరు, డిసెంబర్ 16: ఉరేసుకొని యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన పట్టణంలోని శివాజీనగర్‌లో చోటుచేసుకున్నది. పట్టణానికి చెందిన రవి ఆచారి రెండో కుమారుడు నితీశ్‌కుమార్ (18) ఆదివారం అర్ధరాత్రి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లిదండ్రులు, అన్న ముగ్గురూ కలిసి ఆదివారం సాయంత్రం మక్తల్ ప్రాంతంలోని కురుమగడ్డ దత్తాత్రేయ క్షేత్రం దర్శనానికి వెళ్లిన నేపథ్యంలో నితీశ్‌కుమార్ ఒంటరిగా ఇంట్లోనే ఉండి ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడు. సోమవారం ఉదయం 9గంటలకు తల్లిదండ్రులు ఇంటికి తిరిగిరాగా ఇల్లు లోపలి నుంచి గడియ వేసి ఉండగా ఎంత పిలిచినా పలకపోవడంతో తలుపులు బద్దలుకొట్టి తెరిచారు. ఈ క్రమంలో నితీశ్ ఉరివేసుకొని మృతిచెందినట్లు కుటుంబసభ్యులు గుర్తించారు. పోలీసులకు సమాచారం అందించగా ఎస్సై నరేందర్ నేతృత్వంలో పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసు వర్గాలు వెల్లడించాయి. మృతుడు నితీశ్ పదో తరగతి పూర్తయ్యాక బెంగళూరులో గ్లాస్ ఫిట్టింగ్ పనిచేస్తుండగా మూడు నెలలుగా ఇంటి వద్దే ఉంటున్నట్లు తెలుస్తోంది. ఆత్మహత్యకు గల కారణాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

మరో రెండు రోజులు నిరసనలు

గద్వాల అర్బన్, డిసెంబర్ 16 : రాష్ట్ర ప్రభుత్వం జిల్లా కేంద్రంలోని ఉన్న కోర్టు సముదాయ నిర్మాణ స్థల విషయంలో తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని గద్వాల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రఘురాంరెడ్డి ప్రకటనలో డిమాండ్ చేశారు. వారంరోజులుగా విధులను బహిష్కరించి శాంతియుత పద్ధతిలో నిరసన తెలియజేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకవడం శోచనీయమన్నారు. ప్రస్తుతం ఉన్న స్థలంలో కానీ పట్టణానికి దగ్గరగా ఉన్న స్థలాల్లో నిర్మించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పూడురు గ్రామ శివారులో కేటాయించిన స్థలాన్ని ఎక్కువ మంది న్యాయవాదులు వ్యతిరేకిస్తున్నారన్నారు. ఈక్రమంలో విధుల బహిష్కరణకు మరో రెండు రోజులకు పొడగిస్తున్నట్లు తెలిపారు. సోమ, మంగళవారాల్లో కూడా విధుల బహిష్కరణ ఉంటుందని తెలిపారు.

ధ్యానంతో ఉజ్వల భవిష్యత్

పాన్‌గల్, డిసెంబర్ 16 : ధ్యానంతో ఉజ్వల భవిష్యత్ లభిస్తుందని యోగా నిపుణులు మధుసూదన్ అన్నారు. మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం విద్యార్థులకు యోగాపై ఆయన అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ధాన్యం ఎలా చేయాలో, దాని కలిగే ప్రయోజనాలను వివరించారు. చదువుపై ఏకాగ్రత పెంచడం, భయాన్ని పారదోలడం వంటి విషయాలను వివరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్స్‌పాల్ సుదర్శన్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన గ్రూప్-2 పరీక్షలు

- జోగులాంబ గద్వాల కలెక్టర్ సంతోష్

గద్వాల, డిసెంబర్ 16 : జిల్లాలో ఆది, సోమవారాల్లో జరిగిన గ్రూప్-2 పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయని కలెక్టర్ సంతోష్ సోమవారం ప్రకటనలో తెలిపారు. పరీక్ష నిర్వాహణలో ఎక్కడా ఎలాంటి ఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. పరీక్షల నిర్వహణ కోసం జిల్లాలో 25 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసి కేంద్రాల వద్ద అధికారులు 144 సెక్షన్ విధించినట్లు తెలిపారు. జిల్లాలో 8,722మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా మొదటి రోజు ఆదివారం రెండు సెషన్స్‌లో పరీక్షకు 49.48శాతం మంది హాజరయ్యారన్నారు. రెండో రోజు సోమవారం రెండు సెషన్లలో 48.06శాతం మంది హాజరయ్యారని కలెక్టర్ తెలిపారు. పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించిన అధికారులను కలెక్టర్ ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు.

వనపర్తి జిల్లాలో ..

వనపర్తి టౌన్, డిసెంబర్ 16 : వనపర్తి జిల్లావ్యాప్తంగా జరిగిన గ్రూప్-2 పరీక్ష సోమవారం ప్రశాంతంగా ముగిశాయని అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ తెలిపారు. గ్రూప్-2 పరీక్షల్లో రెండో రోజు పేపర్ 3, 4 పరీక్షలు నిర్వహించారు. అదనపు కలెక్టర్లు సంచిత్ గంగ్వార్, వెంకటేశ్వర్లు చాణిక్య ఉన్నత పాఠశాల, మహిళా డిగ్రీ కళాశాల, కొత్తకోటలోని ఉషోదయ టాలెంట్ స్కూల్ పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. జిల్లాలోని మొత్తం 31 కేంద్రాల్లో 8569 మంది పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా పేపర్-3లో 4,329 మంది అభ్యర్థులు హాజరుకాగా 4,240 మంది గైర్హాజరయ్యారు. ఉదయం 50.52శాతం నమోదు కాగా , మధ్యాహ్నం జరిగిన నాలుగో పేపర్‌కు 4,288 మంది అభ్యర్థులు హాజరు కాగా 4,281 మంది గైర్హాజరయ్యారు. .

వనపర్తి జిల్లా కేంద్రంలో అనూస్ స్కూల్ పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

గ్రూప్-2 పరీక్షా కేంద్రాలను పరిశీలించిన డీఐజీ

గ్రూప్-2 పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఐజీ ఎల్‌ఎస్ చౌహాన్

వనపర్తి టౌన్, డిసెంబర్ 16 : జిల్లా వ్యాప్తంగా కొనసాగిన గ్రూప్-2 పరీక్షా కేంద్రాలను సోమవారం జోగులాంబ జోన్ డీఐజీ ఎల్‌ఎస్ చౌహాన్, ఎస్పీ రావుల గిరిధర్‌తో కలిసి పరిశీలించారు. పరీక్షా సరళిని, కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తును పరిశీలించారు. జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల తదితర పరీక్షా కేంద్రాలను పర్యవేక్షించి పోలీస్ అధికారులు, సిబ్బంది బాధ్యతగా పనిచేయాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పరీక్షా పత్రాలు స్ట్రాంగ్ రూంకు చేరే వరకు అప్రమత్తంగా ఉండాలని డీఐజీ సూచించారు. వారి వెంట డీఎస్పీ వెంకటేశ్వర్‌రావు, సీఐ కృష్ణ ఉన్నారు.

పటిష్టంగా బందోబస్తు

గద్వాల అర్బన్, డిసెంబర్ 15 : గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న పరీక్షలు ప్రశాంతంగా ముగినట్లు ఎస్పీ శ్రీనివాసరావు పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ఆయా పరీక్షా కేంద్రాలను సోమవారం పరిశీలించి మాట్లాడారు. పరీక్షా కేంద్రాల వద్ద అప్రమత్తంగా ఉండాలని పోలీస్ అధికారులు, సిబ్బందికి సూచించారు. జిల్లా వ్యాప్తంగా 25 పరీక్షా కేంద్రాల్లో ప్రశాంతంగా కొనసాగుతుందని తెలిపారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోలేదని తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తూ పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఇందిరమ్మ ఇండ్ల వివరాల సేకరణలో వేగం పెంచాలి

- అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్



పెద్దగూడెం తండాలో ఇందిరమ్మ ఇండ్ల వివరాల సేకరణను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

వనపర్తి టౌన్, డిసెంబర్ 16: ఇందిరమ్మ ఇండ్ల వివరాల సేకరణలో వేగం పెంచాలని అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ ఆదేశించారు. ఇండ్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక యాప్ ద్వారా క్షేత్ర స్థాయిలో సర్వే నిర్వహిస్తుందని, సోమవారం వనపర్తి మండలంలోని పెద్దగూడెం తండాలో, కొత్తకోట మున్సిపాలిటీలో నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇండ్ల వివరాల సేకరణ ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పకడ్బందీగా సర్వే నిర్వహించడంతోపాటు త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామంలో 750 కన్నా ఎక్కువ ఇండ్లు ఉంటే మరో లాగిన్ చేసి ఇంకొకరికి బాధ్యతలు అప్పగించాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల వివరాల సేకరణలో వేగం పెంచాలని ఆదేశించారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా పరీక్షల విభాగపు అధికారి చంద్రశేఖర్

పాన్‌గల్, డిసెంబర్ 16 : రానున్న పదోతరగతి పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయాలని జిల్లా పరీక్షల విభాగపు అధికారి చంద్రశేఖర్, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ఎగ్జామినర్ గణేశ్‌కుమార్ తెలిపారు. మండలకేంద్రంలో వివిధ పాఠశాల హెచ్‌ఎంలతో మంగళవారం పరీక్షలపై సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థుల యాక్షన్ ప్లాన్ అమలు చేయాలన్నారు. చదువులో వెనుకబడి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఆదేశించారు. సమావేశంలో ఎంఈవో శ్రీ నివాసులు, హెచ్‌ఎంలు శంకరయ్య, మద్దిలేటి పాల్గొన్నా రు.

ప్రజా వైద్యుడు బాలకిష్టయ్యకు ఘన నివాళి

వనపర్తి టౌన్, డిసెంబర్ 16: వనపర్తి మాజీ ఎమ్మెల్యే ప్రజా వైద్యుడు బాలకిష్టయ్య వర్ధంతిని బీఆర్‌ఎస్ పట్టణ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానలో ఉన్న ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు రమేశ్‌గౌడ్ మాట్లాడుతూ బాలకిష్టయ్య అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేశారని, వైద్య సేవలు అందించి పేదలకు దేవుడిగా కీర్తి గడించారన్నారు. ఆయన ఆదర్శబావాలు నేడు రాజకీయ నాయకులు స్ఫూర్తిగా తీసుకొని ముందుకుసా గాలన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పట్టణ కార్యదర్శి గంధం పరంజ్యోతి, బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు బం డారు కృష్ణయ్య, నాగన్న యాదవ్, రహీం, బీఆర్‌ఎస్ నాయకులు నీలస్వామి, చిట్యాల రాము, దానియేలు, తోట శ్రీను తదితరులు ఉన్నారు.

బాలకిష్టయ్య విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

'పది' విద్యార్థులకు అల్పాహారం ఏర్పాటు

అమరచింత, డిసెంబర్ 16 : పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న నలభై మంది విద్యార్థులకు డీఎంఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అల్పాహారం ఏర్పాటు చేసినట్లు ట్రస్ట్ సభ్యులు చిన్న వెంకట్‌రెడ్డి, శ్యామ్, బాలికల పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కరుణాకర్ తెలిపారు. సోమవారం పాఠశాలలో ఉపాధ్యాయులతో కలిసి వారు విద్యార్థులకు అల్పాహార కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ప్రతి ఏడాది మాదిరిగానే పాఠశాలలో ప్రేరణ తరగతులకు హాజరయ్యే విద్యార్థులకు ఉదయం పూట అల్పాహారాన్ని ఏర్పాటు చేయాలని పాఠశాల తరఫున కోరడంతో డీఎంఆర్ ట్రస్ట్ చైర్మన్ దేశాయ్ ప్రకాశ్‌రెడ్డి వార్షిక పరీక్షల పూర్తయ్యేవరకు అందజేయాలని అందుకు ఎంత ఖర్చు అయినా తానే ఇస్తానని చెప్పినట్లుగా వారు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆదామ్, విమల ఉన్నారు.

అమరచింత బాలికల పాఠశాలలో అల్పాహారం కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ట్రస్ట్ సభ్యులు

జిల్లా స్థాయిలో రెండో స్థానం

వాలీబాల్‌లో రన్నర్ కప్‌ను అందుకుంటున్న బాలికల జట్టు

మల్దకల్, డిసెంబర్ 16 : జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో సోమవారం జరిగిన సీఎం కప్ జిల్లా స్థాయి పోటీల్లో మల్దకల్ మండలానికి రెండో స్థానం లభించిందని ఎంఈవో సురేశ్, పీడీ సుహాసిని తెలిపారు. జిల్లా కేంద్రంలో జరిగిన మహిళల వాలీబాల్ పోటీల్లో ద్వితీయ స్థానంలో నిలించి ట్రోఫిని అందుకున్నట్లు తెలిపారు. ట్రోఫీని అందుకున్న మహిళల జట్టును ఎంఈవోతో పాటు క్రీడా ఉపాధ్యాయులు ఆనంద్, రత్నమాల, రజినీ కాంత్ తదితరులు అభినందించారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

WANTED
★హరి డే కేర్ ఆసుపత్రిలో పని చేయుటకు నర్సింగ్ స్టాఫ్ కావలెను. సంప్రదించవలసిన సెల్ నెం.8328035779.
NT- MBNR

To Book your Classified
4 lines Advt
Rs. 200/-
Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777748

ప్రకటన
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.